క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థిని ప్రతిభ



విద్యార్థినిని అభినందిస్తున్న దృశ్యం

రుద్రవరం: స్థానిక తువ్వపల్లె తిప్పమీదున్న ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన రమ్య అనే విద్యార్థిని ఎస్‌జీఎఫ్–19 కుస్తీ రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చూపి కాంస్య పతకం సాధించింది. దీంతో బుధవారం ఆమెను ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పాఠశాలలో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్న రమ్య ఈ నెల 11,12,13 తేదీల్లో విజయవాడ రూరల్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపి పతకం సాధించింది. శిక్షణ ఇచ్చిన పీడీ శ్రీనివాసులును అభినందించారు.

19న సచ్చిదానంద సరస్వతి రాక

నంద్యాల(అర్బన్): హరిహరపురం పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతి మహాస్వామి ఈ నెల 19వ తేదీన మండలంలోని మునగాల గ్రామానికి రానున్నట్లు గ్రామ మాజీ సర్పంచ్, భరత్ వికాస్ పరిషత్ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి బుధవారం తెలిపారు. స్వామి వారి రాక సందర్భంగా శోభాయాత్ర, సాయంత్రం శ్రీచక్ర సవావరణ పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు.

విద్యార్థులకు కంటి అద్దాల పంపిణీ

ఉయ్యాలవాడ : కంటి సమస్యలున్న పలువురు విద్యార్థులకు అద్దాలు పంపిణీ చేశామని వైద్యాధికారిణి అపర్ణ తెలిపారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 9 మంది, మోడల్‌స్కూల్‌లో 32 మంది, కొండుపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 11 మంది విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ ఇటీవల ఆయా గ్రామ సచివాలయాల పరిధిలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష వైద్య శిబిరాల్లో కంటి చూపు సమస్యతో ఇబ్బందులు పడుతున్న విద్యార్థులకు పరీక్షలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో కంటి వైద్య నిపుణులు రమేష్, హెల్త్ సూపర్‌వైజర్లు రామచంద్రుడు, దస్తగిరి పాల్గొన్నారు.

18నుంచి ఆర్యవైశ్య సంఘం ఎన్నికలు

నంద్యాల(వ్యవసాయం): ఈనెల 18వ తేదీ నుంచి నంద్యాల జిల్లా ఆర్యవైశ్య సంఘం ఎన్నికల ప్రక్రియ ప్రారంభమవుతుందని కర్నూలు ఉమ్మడి జిల్లా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వీరబొమ్మ నాగసత్యనారాయణ, బింగుమళ్ల శ్యాంసుందర్ గుప్తా తెలిపారు. బుధవారం స్థానిక మెయిన్ బజార్‌లోని అమ్మవారిశాలలో విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ 18 నుంచి 24వ తేదీ వరకు నామినేషన్లు, 25న పరిశీలన, 26 నుంచి 29వ తేదీ వరకు ఉపసంహరణ, డిసెంబర్ 7న ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎన్నికల్లో 27మండలాల సభ్యులు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో పార్థసారధి, భవనాశివాసు, వెంకటసుబ్బయ్య, జంగంశెట్టి, రాష్ట్ర పొలిటికల్ వైస్ చైర్మన్ ఖండే శ్యాంసుందర్ లాల్ పాల్గొన్నారు.

గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన

నంద్యాల(వ్యవసాయం): 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని స్థానిక శ్రీ పింగళి సూరన స్మారక శాఖా గ్రంథాలయంలో రెండవ రోజు బుధవారం విద్యార్థులకు పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రిటైర్డ్ లైబ్రేరియన్ సుబ్బారావు, తెలుగు పండితులు నాగేషులు పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాలను సందర్శించి మేధస్సును పెంపొందించుకుని పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలన్నారు.

చాగలమర్రి: గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా స్థానిక మల్లెవేముల చౌరస్తాలో ఉన్న గ్రంథాలయంలో బుధవారం లైబ్రేరియన్ బండారు రామచంద్రుడు ఆధ్వర్యంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. వివిధ పుస్తకాల గురించి పాఠకులకు వివరించారు.

ఆదర్శ ఆర్టీసీ ఉద్యోగులకు ప్రోత్సాహకాలు

నంద్యాల టౌన్: స్థానిక ఆర్టీసీ డిపోలో అక్టోబర్ నెలలో ఉత్తమ ప్రతిభ చూపిన ఉద్యోగులను డిపో మేనేజర్ గంగాధర్ రావు అభినందించారు. బుధవారం డిపో ఆవరణలో ఉత్తమ ప్రతిభ కనపరచిన కండక్టర్లు డీఎంఎన్ నాయుడు, శేషన్న, రామయ్య,రాజు, మల్లికార్జున, డ్రైవర్లు నాగన్న, వలి, శేఖర్, ప్రసాద్, భాస్కర్‌ను అభినందించి ప్రశంసా పత్రాలు, ప్రోత్సాహకాలు అందజేశారు. అసిస్టెంట్ మేనేజర్ మద్దిలేటి, స్టేషన్ మేనేజర్ బాషా పాల్గొన్నారు.

నేడు మండల మీట్

దొర్నిపాడు: స్థానిక మండల కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని గురువారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుబ్బారెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ అమర్‌నాధ్‌రెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశానికి మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు. అలాగే.. గుండుపాపల సచివాలయ పరిధిలో పల్లెకు పోదాం కార్యక్రమం గురువారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. ప్రజాప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు హాజరు కావాలని కోరారు.

వైఎస్సార్‌సీపీతోనే అభివృద్ధి, సంక్షేమం

ఆళ్లగడ్డ: నాలుగున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వల్ల మీకు మేలు జరిగిందని భావిస్తేనే వచ్చే ఎన్నికల్లో తిరిగి జగనన్నకు ఓటు వేసి పట్టం కట్టాలని ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి విజ్ఞప్తి చేశారు. మండలంలోని జిజమ్ములదిన్నె గ్రామ సచివాలయ పరిధిలో బుధవారం ఈఓపీఆర్డీ తాహిర్‌హుసేన్ అధ్యక్షతన పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యక్షంగా, పరోక్ష ప్రయోజనాల ద్వారా మొత్తం రూ.17.84 కోట్లుకు సంబంధించిన బోర్డును ఆవిష్కరించారు. అనంతరం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కొశెట్టి నాగేశ్వరరావు, మండల జేసీఎస్ కన్వీనర్ రామకృష్ణ ఆధ్వర్యంలో గ్రామ ప్రధాన కూడలిలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్యామల, నాయకులు గంగుల రామిరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, రంగస్వామిరెడ్డి, మధుసూధన్‌రెడ్డి, యాదవాడ నరసింహారెడ్డి ఉన్నారు.

పట్టణంలో..

మున్సిపాలిటీ పరిధిలోని సద్దాం కాలనీ వార్డు సచివాలయ ఆవరణలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన మా నమ్మకం నువ్వే జగన్ బోర్డును వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు నరసింహారెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసిన పార్టీ జెండాను నాయకులతో కలిసి ఎగురవేశారు.

రుద్రవరం: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే అర్హులందరికీ సంక్షేమ పథకాలు, అభివృద్ధి సాధ్యమని, ఇందుకు జగనన్నను మళ్లీ సీఎంగా గెలిపించుకుందామని ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ గంధం రాఘవరెడ్డి ప్రజలను కోరారు. మండలంలోని ఆలమూరులో బుధవారం ఏపీకీ జగన్ ఎందుకు కావాలంటే అనే కార్యక్రమంలో ఆయన గ్రామ సర్పంచ్ పాణ్యం లక్ష్మీదేవి,పార్టీ మండల అధ్యక్షులు ప్రసాదరెడ్డి,మండల కన్వీనర్ నాగేష్,నాయకులు చంద్ర,ప్రభాకర్ తదితరులు గ్రామంలో ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు, చేకూరిన లబ్ధిని, అభివృద్ధిని వివరించారు. పథకాలు, అభివృద్ధి కొనసాగాలంటే మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావాలని చెప్పారు. అలాగే పల్లెకు పోదాం అనే కార్యక్రమంలో భాగంగా ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి,నోడల్ అధికారి శ్రీనివాసశర్మ గ్రామ సభ నిర్వహించారు. అక్కడ ప్రభుత్వ సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ అర్హులై ఉండి సంక్షేమ పథకాలు అందని వారుంటే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బ్రహ్మయ్య, దేవగుడి జాకీర్ పాల్గొన్నారు.



మహిళకు చేకూరిన లబ్ధిని వివరించి బ్రోచర్ అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



మాట్లాడుతున్న ఈఓఆర్డీ అనసూయ



మా నమ్మకం నువ్వే జగనన్న బోర్డును ప్రారంభిస్తున్న దృశ్యం

జగనన్న చేసిన అభివృద్ధిని వివరించండి

ఉయ్యాలవాడ : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగున్నరేళ్ల కాలంలో చేసిన అభివృద్ధిని గడప గడపకు వెళ్లి ప్రజలకు వివరించాలని జెడ్పీటీసీ కసాని పుణ్యలక్ష్మీదేవి, ఎంపీపీ బుద్ధా భాగ్యమ్మ సూచించారు. బుధవారం మండలంలోని హరివరం గ్రామ సచివాలయంలో నిర్వహించిన పల్లెకు పోదాం కార్యక్రమంలో ముందుగా సచివాలయంలో ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి డిస్‌ప్లే బోర్డును సర్పంచ్ నడిపెన్న, అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ సచివాలయం పరిధిలో నాలుగున్నర సంవత్సరాల్లో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కోసం రూ. 21,43,55,699 ఖర్చు చేశామన్నారు. 4,310 మంది లబ్ధిదారులకు వివిద సంక్షేమ పథకాల ద్వారా రూ.13,15,88,054 ప్రత్యక్షంగా వారి వ్యక్తిగత ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసిందన్నారు. పరోక్షంగా 1,611 మంది లబ్ధిదారులకు రూ. 6,02,35,853 అందజేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు పెద్ద పీరయ్య, ఉప సర్పంచ్ ఎర్రి శ్రీనివాసరెడ్డి, మాజీ సర్పంచ్ తరిగోపుల ప్రసాద్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు పల్లె మహేశ్వరరెడ్డి, ఈఓపీఆర్‌డీ వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌బాబు పాల్గొన్నారు.



హరివరంలో సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీ, అధికారులు

గోస్పాడు: కానాల పల్లె గ్రామ ప్రజలకు రూ.14.30కోట్ల ప్రయోజనం చేకూరిందని ఈఓఆర్డీ అనసూయ తెలిపారు. పల్లెకు పోదాం కార్యక్రమంలో భాగంగా వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని బుధవారం కానాలపల్లె గ్రామంలో నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం పేద ప్రజలకు సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. నవరత్నాలు, ఆంధ్రుల ప్రగతికి రథచక్రాలు అనే నినాదంతో జగనే ఎందుకు కావాలంటే నినాదంలో భాగంగా పల్లెకు పోదాం కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. సర్పంచ్ గద్దం లింగమ్మ, నాయకులు శంకర్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

శిరివెళ్ల: ప్రతి ఇంటికీ నవరత్నాల్లోని ఏదో ఒక పథకం అందిందని వక్ఫ్‌బోర్డు జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు బీ.అబ్దుల్ సలాం అన్నారు. బుధవారం స్థానిక 4వ గ్రామ సచివాలయంలో పల్లెకు పోదాం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డు,బ్రోచర్లను ఈఓఆర్డీ నాగేంద్ర, సర్పంచు సాలమ్మ ఆవిష్కరించారు. సర్పంచు మాట్లాడుతు నాలుగు సచివాల పరిధిలో రూ.23 కోట్ల ప్రత్యక్షంగా, మరో రూ.3.27 కోట్ల పరోక్షంగా ప్రజలకు లబ్ధి చేకూరిందని, రూ.2.50 కోట్ల మేరకు వివిధ అభివృద్ధి పనులు జరిగాయన్నారు. ఉపసర్పంచు ఇంతియాజ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నజీర్, దేవస్థానం చైర్మన్ తిమ్మరాయుడు, కాపు సంఘం నాయకుడు ఉల్లి సుబ్బరాయుడు పాల్గొన్నారు.

బాబు మాటలను నమ్మొద్దు..

పల్లెకు పోదాం కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రం శిరివెళ్లలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఇందూరి ప్రతాపరెడ్డి 14వ వార్డులో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలు, లబ్ధిని ప్రజలకు వివరించారు. టీడీపీ పాలన, జగనన్న పాలనలోని తేడాలను వివరించి, వీరిలో ఎవరు ప్రజల కోసం పనిచేస్తున్నారో తెలుసుకోవాలని కోరారు. అధికారం కోసం చంద్రబాబునాయుడు మాయ మాటలు చెబుతున్నారని వాటిని నమ్మొద్దని చెప్పారు. మళ్లీ జగనన్నే సీఎంగా చేసుకుందామని పిలుపునిచ్చారు.

చాగలమర్రి: స్థానిక 4వ సచివాలయ పరిధిలో నాడు–నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలలు, ఆసుపత్రులు, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా రోడ్లు, డ్రైనేజీలు, గ్రామ సచివాలయాల నిర్మాణం, తదితర అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం సుమారు రూ.18,95,69,065 వ్యయం చేసిందని సర్పంచ్ తులసమ్మ, పార్టీ మండల అధ్యక్షుడు జి.కుమార్‌రెడ్డి తెలిపారు. బుధవారం చాగలమర్రిలోని 4వ సచివాలయం వద్ద వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం సచివాలయంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించే డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. అలాగే పార్టీ జెండాను ఎగురవేశారు.

నంద్యాల(అర్బన్): ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితోనే ప్రజా సంక్షేమం సాధ్యమవుతుందని బిల్లలాపురం గ్రామ సర్పంచ్ రమణమ్మ, ఎంపీటీసీ రామ లక్ష్మమ్మ తెలిపారు. బుధవారం గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈఓఆర్డీ మహీధర్‌రెడ్డి, సర్పంచ్, ఎంపీటీసీ, గ్రామ నాయకుల ఆధ్వర్యంలో గ్రామంలోని లబ్ధిదారులకు సంక్షేమ పథకాల ద్వారారూ.13.48కోట్లు వారి ఖాతాల్లో చేరాయని చెప్పారు. అనంతరం ఇందకు సంబంధించిన డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. నాయకులు సుబ్బయ్య, శ్రీరాములు, సిద్దం శివరాం పాల్గొన్నారు .

దొర్నిపాడు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి ఇంటా ప్రభుత్వం సంక్షేమ వెలుగులు నింపిందని ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి పేర్కొన్నారు. పల్లెకు పోదాం కార్యక్రమంలో భాగంగా బుధవారం దొర్నిపాడు సచివాలయం–2లో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రభుత్వం రూ.18.83 కోట్లు ఖర్చు చేసిందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శకుంతల, యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బత్తుల నాగేశ్వరరావు, ఎంపీటీసీ లక్ష్మిదేవి, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, సుబ్బయ్య, చిన్నవెంకటరామిరెడ్డి, లక్ష్మిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రాముడు, ప్రసాద్‌రెడ్డి, నాగరాజు, శీను, గోపాల్ యాదవ్, డీలర్ శివుడు, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

నంద్యాల(సిటీ): ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఒక వ్యక్తి కాదని ఆయన ఒక శక్తి అని రాష్ట్ర దృశ్యకళల డైరెక్టర్ గుండాల సునీత అమృతరాజ్ తెలిపారు. బుధవారం రాష్ట్రానికి జగనన్నే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 21వ వార్డు నూనెపల్లెలో వార్డుకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. వార్డులో లబ్ధిదారులకు వివిధ సంక్షేమ పథకాల రూపంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా జరిగిన లబ్ధిని వివరిస్తూ ఏర్పాటు చేసిన డిస్‌ప్లే బోర్డును స్థానిక నాయకుడు అనిల్ అమృతరాజుతో కలిసి ఆవిష్కరించారు. పార్టీ పట్టణ అధ్యక్షులు జాకీర్‌హుసేన్, సాయిరాంరెడ్డి, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రజా ప్రతినిధులు



చాగలమర్రిలో అభివృద్ధి, పథకాలను వివరించే డిజిటల్ బోర్డును ఆవిష్కరిస్తున్న దృశ్యం



డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న దృశ్యం



దొర్నిపాడులో ప్రధాన కూడలిలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు



మాట్లాడుతున్న సునీత అమృతరాజ్

గడప గడపకు సంక్షేమ ఫలాలు



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే శిల్పారవి

నంద్యాల(సిటీ): జగనన్న పాలనలో ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందాయని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని 40వ వార్డులో మున్సిపల్ వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్‌తో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వార్డులో గడప గడపకు తిరిగి సంక్షేమ పథకాలపై కరపత్రాలను లబ్ధిదారులకు అందించి వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న అధికారంలోకి వచ్చాక అర్హతే ప్రామాణికంగా పథకాలు అందజేసి దేశంలో నూతన శకానికి నాంది పలికారన్నారు. తీవ్ర వర్షాభావ పరిస్థితిలో కూడా రైతులకు అండగా ఉంటూ పంటలకు నీటిని అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో నంద్యాల పట్టణ అధ్యక్షుడు పున్నా శేషయ్య, కౌన్సిలర్లు కలాంబాషా, షాదిక్ బాషా, సమ్మద్, కృష్ణమోహన్, నాయకులు లక్ష్మీనారాయణ, కిరణ్, రహంతుల్లా, హరి, నాగరాజు పాల్గొన్నారు. కాగా..24వ వార్డులో నీటి సమస్య ఉన్నట్లు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించి పరిష్కరించేందుకు రూ.20లక్షలు మంజూరు చేయించామని ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పాంషావలి, అడ్వకేట్ శ్రీనివాసులు, కౌన్సిలర్ కలాంబాషా, నాయకులు సోమశేఖర్‌రెడ్డి, పెద్ద కబీర్, మునయ్య, ఖాజవలి, మస్తాన్, కలాం పాల్గొన్నారు.

17న దుకాణాల నిర్వహణకు వేలాలు

శిరివెళ్ల: శ్రీ సర్వ నరసింహస్వామి ఆలయంలో ఈ నెల 17వ తేదీన వివిధ దుకాణాల నిర్వహణకు బహిరంగ వేలాలు నిర్వహిస్తున్నట్లు ఈఓ నరసయ్య బుధవారం తెలిపారు. 2024 నవంబర్ వరకు టెంకాయలు, తినుబండారాలు,కూల్ డ్రింక్స్, ఐస్ క్రీం, బొమ్మలు, తలనీలాల పోగుచేసుకునేందుకు వేలం పాటలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఆసక్తి గల వారు రూ.2వేల నుంచి రూ.5 వేల వరకు డిపాజిట్లు చెల్లించి పాటలలో పాల్గొనాలని సూచించారు. ఆలయానికి బకాయిలున్న వారు అనర్హులని స్పష్టం చేశారు.

కేసీలో వింత జంతువు

పగిద్యాల: మండలంలోని ఆంజనేయనగర్ సమీపాన బుధవారం కేసీ కాలువలో విచిత్రమైన జంతువు ప్రత్యక్షమైంది. నీటిలోని చేపను వేటాడి కాలువ బెడ్‌పైకి వచ్చిన జంతువును మొక్కజొన్నలు కాటా వేయడానికి వెళ్లిన హమాలీలు ఫోన్‌లో వీడియో తీసి సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేశారు. డాల్ఫిన్‌ను పోలినట్లు కనిపించే ఈ జంతువు ఏమై ఉంటుందని వాట్సాప్ సందేశాలు చక్కర్లు కొట్టాయి. అయితే శ్రీశైలం బ్యాక్‌వాటర్‌లో నీటి కుక్కలు ఉన్నాయని ఇటీవల యూట్యూబ్ ఛానళ్లలో విస్తృతంగా ప్రచారం చేశారు. అందువల్ల ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుంచి శ్రీశైలం బ్యాక్‌వాటర్‌ను కేసీసీ లిఫ్ట్ మోటర్ల ద్వారా కాలువలోకి వెళ్లి ఉంటాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.



కేసీ కాలువలో ప్రత్యక్షమైన విచిత్ర జంతువు

మినీ ట్రక్కు బోల్తా

మహానంది: మండలంలోని బసవాపురం, గాజులపల్లెకు చెందిన కొందరు మినీ ట్రక్కులో పల్నాడు జిల్లాలోని కోటప్పకొండ క్షేత్రానికి వెళ్లారు. త్రికోటేశ్వరస్వామిని దర్శించుకుని వస్తుండగా ఘాట్‌రోడ్డులో వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. బసవాపురం గ్రామానికి చెందిన ఆరుగురు గాయపడగా నంద్యాలలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

గో సంరక్షణ పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలదేవస్థానం నిర్వహిస్తున్న గో సంరక్షణనిధికి సంగారెడ్డి జిల్లాకు చెందిన సి.రాములు రూ.1,00,116 లు విరాళంగా అందజేశారు. ఈ విరాళాన్ని విరాళాల కేంద్రంలోని పర్యవేక్షకులు టి.హిమబిందుకు అందజేయగా వారు దాతలకు స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలు, జ్ఞాపికను అందజేశారు.

ఖోఖో కోచింగ్ క్యాంపు ప్రారంభం

వెలుగోడు: పట్టణంలోని జెడ్పీ హైస్కూల్‌లో ఖోఖో సబ్ జూనియర్ కోచింగ్ క్యాంప్‌ను ఎంపీపీ లాలం రమేష్, మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ వేల్పుల జైపాల్ బుధవారం ప్రారంభించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాల క్రీడాకారులు ఈనెల 26న గుంటూరు జిల్లా నరసరావుపేటలో జరగబోయే 33వ సబ్ జూనియర్ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనన్నారు. వారికి వెలుగోడు పట్టణంలో పది రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. క్రీడాకారులకు అక్షయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పది రోజులు సరిపడే బియ్యం ప్యాకెట్లను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్ రెడ్డి వెలుగోడు, పట్టణ అధ్యక్షులు ఎం ఇలియాస్ ఖాన్, యూత్ నాయకులు షంషీర్, తెలుగు రమణ, జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం సత్యనారాయణ రావు తదితరులు పాల్గొన్నారు.



కోచింగ్ క్యాంపులో మాట్లాడుతున్న ఎంపీపీ లాలం రమేష్

అర్హులందరికీ రుణాలిచ్చి ఆర్థిక ప్రగతికి సహకరించండి

నంద్యాల: వ్యవసాయం, ఇతర ప్రాధాన్యతా ఉపాధి రంగాలపై ఆధారపడి జీవిస్తున్న అర్హులందరికీ రుణాలిచ్చి ఆర్థిక ప్రగతికి తోడ్పాటు అందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ శామూన్ బ్యాంకర్లకు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా బ్యాంకర్ల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఇందుకు ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, నందికొట్కూరు ఎమ్మెల్యే తొగూర్ ఆర్థర్, ఆర్బీఐ ఏజీఎం మహమ్మద్ జైర్ రెహమాన్, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ రీజనల్ హెడ్ పీఎస్ నవీన్ కుమార్, ఎల్‌డీఎం రవీంద్ర కుమార్, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి, వ్యవసాయ శాఖకు సంబంధించిన అధికారులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ లక్ష్యం మేరకు రుణాలు అందించి ఆర్థిక ప్రగతికి తోడ్పాటు అందించాలని కోరారు. వ్యవసాయ శాఖ ద్వారా 22,520 మందికి సీసీ కార్డులు జారీ చేశామని, వ్యవసాయంపై ఆధారపడి కౌలు చేసుకుంటున్న రైతులందరికీ విరివిగా రుణాలివ్వాలన్నారు. కరువు మండలాలుగా ప్రకటించిన 6 మండలాల్లో రైతులు తీసుకున్న పంట రుణాలను రిజర్వ్ బ్యాంక్ నిబంధనల మేరకు రీ కన్‌స్ట్రక్షన్ చేయాలని చెప్పారు. అలాగే 132 చిన్న, సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలకు సంబంధించి కేటాయించిన లక్ష్యం మేరకు 91 యూనిట్లకు రుణాలందించామని మిగిలిన యూనిట్లకు రుణాలందించి యువ పారిశ్రామిక వేత్తలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించి ఉపాధి కల్పనకు తోడ్పాటునందించాలన్నారు. జగనన్న బడుగు వికాసం కింద బడుగు బలహీన వర్గాల వారిని ఆర్థికంగా నిలబెట్టేందుకు ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలకు ప్రాధాన్యతనిచ్చి విరివిగా రుణాలు అందించాలన్నారు. పీఎంఈజీపీ, హౌసింగ్, స్టాండ్ అప్ ఇండియా, ముద్ర స్కీము రుణాలకు సంబంధించి ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించి అర్హులందరికీ రుణాలిచ్చి సహకరించాలన్నారు. జగనన్న తోడు పథకం కిందద చిరు వ్యాపారులు, చేతివృత్తులపై ఆధారపడి జీవిస్తున్న వారికి పెట్టుబడి కింద రుణాలు ఇవ్వాలని, మత్స్యశాఖ, పశు సంపద, ఇతర సంక్షేమ రంగాలకు లక్ష్యం మేరకు రుణాలు మంజూరు చేయాలన్నారు. ఎంపీ పోచా మాట్లాడుతూ నీటి వనరులు, నీటి లభ్యత ఉన్న ప్రాంతాలు, బ్లాక్ సాయిల్ ఉన్న ప్రదేశాల్లో ఫిష్ ఆంధ్ర పథకం కింద మత్స్యకారులను ప్రోత్సహించి రుణాలు అందించాలన్నారు. అంతకుముందు ఎల్‌డీఎం మాట్లాడుతూ ఈ ఏడాది పంట రుణాల కింద రూ.4,937 కోట్ల లక్ష్యానికి గాను రూ.3,252 కోట్లు రైతులకు మంజూరు చేశామన్నారు. టర్మ్ రుణాల కింద రూ.2,126 కోట్లకు గాను రూ.1,374 కోట్లు, ఇతర సూక్ష్మ చిన్న తరహా పరిశ్రమలకు రూ.1031 కోట్లకు గాను రూ.812.81 కోట్లు పంపిణీ చేశామని మిగిలిన లక్ష్యాలను డిసెంబర్ లోపు పూర్తి చేస్తామని కమిటీకి నివేదించారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి మోహన్ రావు, ఉద్యాన శాఖ అధికారి నాగరాజు, పరిశ్రమల జిల్లా మేనేజర్ శ్రీనివాస యాదవ్, అన్ని సంక్షేమ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన జిల్లా కలెక్టర్, ఎంపీ పోచా, ఎమ్మెల్యే ఆర్థర్

నేడు 'గడప గడపకు మన ప్రభుత్వం'

చాగలమర్రి: మండలంలోని గొడిగనూరు గ్రామంలో గురువారం ఉదయం 9గంటలకు ఎమ్మెల్యే బిజేంద్రాడిరెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తారని ఎంపీడీఓ మహబూబ్‌దౌలా, ఎంపీటీసీ సభ్యుడు పత్తినారాయణ తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ గ్రామంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు కార్యక్రమం జరుగుతుందని, ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు, లబ్ధిని లబ్ధిదారులకు వివరించి, ప్రజల సమస్యలను తెలుసుకుంటారని చెప్పారు. అన్ని శాఖల మండల స్థాయి అధికారులతో పాటు గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొనాలని కోరారు.

మోటార్లు ఉపయోగిస్తే చర్యలు

దొర్నిపాడు: రైతులు కేసీ కెనాల్ నీటిని వృథా చేసుకోరాదని తహసీల్దార్ జయప్రసాద్, ఎస్ఐ తిరుపాల్ సూచించారు. బుధవారం వారు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్, ఎస్పీ ఆదేశాల మేరకు రైతులు సాగునీటి కోసం మోటార్లు వినియోగించుకోరాదని, అలా కాదని మోటార్లు వినియోగించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మోటార్ల ద్వారా నీటిని పొలాలకు మళ్లించుకోవడం ద్వారా చివరి ఆయకట్టు రైతులకు నీరు అందటం లేదన్నారు. ఉన్న నీటిలో ప్రతి రైతు పంట తడవాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు.

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

దొర్నిపాడు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కృషి చేస్తుందని ఎంపీపీ అమర్‌నాథ్ రెడ్డి, యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బత్తుల నాగేశ్వరరావు పేర్కొన్నారు. కేసీ కెనాల్‌కు నీటి విడుదలలో భాగంగా మరో రెండు రోజులు పొడగింపునకు కృషి చేసిన ఏపీ జలవనరుల శాఖ ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. లక్కు చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు సుబ్బయ్య ఉన్నారు.

జామ పంట దున్నివేత

చాగలమర్రి: మండలంలోని ముత్యాలపాడు గ్రామానికి చెందిన రైతు లింగమయ్య తను సాగు చేస్తున్న 2 ఎకరాల విస్తీర్ణంలోని జామ పంటను బుధవారం ట్రాక్టరుతో తొలగించాడు. ఉపాధి హామీ పథకం కింద తన రెండు ఎకరాల్లో రెండేళ్ల క్రితం సుమారు 1800 జామ మొక్కలను సాగు చేశాడు. కోత దశలో పంటకు పండీగ తెగులు, వైరస్ సోకి పంట దిగుబడి తగ్గిపోయి పెట్టిన పెట్టుబడి కూడా చేతికి అందక పోగా, దానికి తోడు రాయితీ డబ్బులు అందకపోవడంతో దిక్కు తోచని స్థితిలో చెట్లను తొలగించేశానని వాపోయాడు.



జామ పంటను తొలగిస్తున్న దృశ్యం

వారంలోపు చెల్లిస్తాం

సాంకేతిక కారణాల వల్ల ముత్యాలపాడు గ్రామానికి చెందిన 13 మంది ఉద్యాన పంటలు సాగు చేసిన రైతుల ఖాతాలకు సంబంధించి ఐఎఫ్‌పీ నంబరు జనరేట్ కాకపోవడంతో ఉపాధిహామీ పథకం రాయితీ వారికి జమ కాలేదు. ఈ నంబరు జనరేట్ అయిన వెంటనే వారి ఖాతాల్లో జమ చేస్తాం.

– సాంబశివరావు, ఏపీడీ

డిసెంబర్ 24న భగవద్గీత పఠన పోటీలు

నంద్యాల(వ్యవసాయం): డిసెంబర్ 24వ తేదీన తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో విద్యార్థులకు భగవద్గీత కంఠస్త పఠన పోటీలు నిర్వహిస్తున్నట్లు తితిదే హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా కార్యనిర్వాహకులు మల్లు వెంకట్‌రెడ్డి తెలిపారు. బుధవారం సాయంత్రం శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానంలోని గీతామందిరంలో కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ స్థానిక మెయిన్‌బజార్‌లోని అమ్మవారిశాలలో పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ పోటీలు 6, 7వ తరగతులకు ఒక భాగం, 8, 9 తరగతులకు మరో విభాగంగా విభజించామన్నారు. అలాగే 18 సంవత్సరాలు దాటిన వారికి మరో విభాగంగా విభజించామన్నారు. గెలుపొందిన విద్యార్థులకు వరుసగా రూ.1000, రూ. 750, రూ 500 ప్రోత్సాహక బహుమతులు అందిస్తామన్నారు.వివరాలకు 9059802265 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

17నుంచి మహిళా సమాఖ్య మహాసభలు

నంద్యాల(న్యూటౌన్): ఈ నెల 17,18,19 తేదీలలో మూడురోజుల పాటు ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య మహాసభలు నిర్వహిస్తామని నంద్యాల జిల్లా సీపీఐ కార్యదర్శి రంగ నాయుడు, బాబఫకృద్దీన్‌లు తెలిపారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాసంఘాల సమావేశంలో వారు మాట్లాడుతూ సభలకు జాతీయ, రాష్ట్రస్థాయి సీపీఐ ప్రముఖులు హాజరవుతున్నట్లు చెప్పారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, సహాయకారదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గా భవాని, రామాంజనేయులుతో పాటు మహిళా సమాఖ్య జాతీయ నాయకురాళ్లు పాల్గొంటారన్నారు.17న బహిరంగ సభ, 18,19వ తేదీల్లో 500 మంది ప్రతినిధులతో సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి సుబ్బరాయుడు, రాధాకృష్ణ, ప్రసాద్, రాముడు, సుగుణమ్మ, కోశాధికారి రంగ నాయుడు పాల్గొన్నారు.